క్లుప్తంగా

ఉన్నత పాఠశాలలో అల్పాహారం ప్రారంభం



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న హెచ్‌ఎం

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లిలోని ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం రాధాకిషన్ విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అల్పాహార పథకం ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ జగన్, యువసేన యూత్ అధ్యక్షుడు నవీన్, ఉపాధ్యాయులు శేషగిరి, పీడీ రమేశ్, షేక్ బబ్బు, లింగప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రెడ్డి



నియామక పత్రం అందజేస్తున్న మల్లారెడ్డి

నిజాంపేట(మెదక్): బీజేపీ ఆదేశాల మేరకు నిజాంపేట మండల బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా కల్వకుంట గ్రామానికి చెందిన రత్నగారి రాజేశ్వర్ రెడ్డిని ఏకగ్రీవంగా నియమించారు. ఈ నియమక పత్రాన్ని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి మండల కిసాన్ మోర్చా అధ్యక్ష బాధ్యతలు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

సమస్యలపై ఉత్తరాల ఉద్యమం



ఉత్తరాలు పంపుతున్న సీనియర్ సిటిజన్‌లు

చేగుంట(తూప్రాన్): సీనియర్ సిటిజన్‌ల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విశ్రాంత ఉద్యోగుల సంఘంలో ఉత్తరాలతో ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్‌ల సంఘం మండలాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్‌లకు రైల్ చార్జీల రాయితీ, ఇన్‌కంటాక్స్ మినహాయింపు, వయోవృద్ధుల సంక్షేమం కోసం నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరాల ద్వారా సమస్యలను వివరిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బస్సు చార్జీల్లో రాయితీ కల్పించాలని, రాజధానిలో వయోవృద్ధుల సంక్షేమ భవనం ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తరాల ద్వారా సమస్యలను తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేశ్వర్, మహిపాల్, నర్సింలు, మాణిక్యం, లక్ష్మణ్, యాదగిరి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వైపు చూస్తున్న ప్రజలు



కండువా కప్పుతున్న అభ్యర్థి మురళీయాదవ్

నర్సాపూర్: నర్సాపూర్ నుంచి బీజేపీ బీసీకి టికెట్ ఇవ్వడంతో ఇతర పార్టీల నాయకులు, ప్రజలు సైతం బీజేపీ వైపు చూస్తున్నారని బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్ చెప్పారు. సోమవారం మాసాయిపేట మండలం రామంతాపూర్ తండాకు చెందిన బీఆర్‌ఎస్ ఉప సర్పంచ్ లోక్యా నాయక్ బీజేపీలో చేరారు. దీంతో అతనికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీకి టికెట్ ఇవ్వడంతో ఇతర పార్టీల నాయకులు తమ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పట్టణంలో సోమవారం కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ నాయకులు సూచించారు. మండలంలోని చెర్లపల్లికి చెందిన పెంటారెడ్డి, శంశిరెడ్డిపల్లి తండా సర్పంచ్ భర్త సిత్యా నాయక్, కుకునూర్ గ్రామానికి చెందిన సాగర్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, నర్సింహారెడ్డి, మల్లేశం, వెంకట్‌రెడ్డి, కిష్టాగౌడ్ పాల్గొన్నారు.

దళారులను నమ్మకండి

- ప్రత్యేక అధికారి నాగరాజు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



మనోహరాబాద్(తూప్రాన్): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి

కొల్చారం(నర్సాపూర్): రైతులు దళారులను నమ్మొద్దని మండల ప్రత్యేక అధికారి నాగరాజు అన్నారు. మండలంలోని అంసాన్‌పల్లి, వసురాం తండా, వెంకటాపూర్, రాంపూర్ గ్రామాల్లో ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రత్యేక అధికారి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, ఏఈఓ ప్రతిభ, డీపీఎం మార్కెటింగ్ అధికారి మోహన్, ఏపీఎం సుశీల, ఐకేపీ సిబ్బంది వెంకటేశం పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండలం పరిధిలోని నార్లాపూర్, తిప్పనగుల్ల, బచ్చురాజ్‌పల్లి, జెడ్ చెరువు తండా, నస్కల్, రాంపూర్, నందగోకుల్, నగరం గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రామాయంపేట సొసైటీ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామాయంపేట సొసైటీ ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె పండిత్, సంఘం కార్యదర్శి నర్సింలు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం సహాయ కార్యదర్శులు దుర్గారెడ్డి, శ్రీనివాస్, మహేశ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కొడిపల్లి(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహ్మద్‌నగర్ పీఏసీఎస్ సీఈఓ దుర్గయ్య తెలిపారు. సొసైటీ పరిధిలో మండల కేంద్రమైన కొడిపల్లితో పాటు 15 గ్రామాల్లో అధికారులు, రైతులతో కలిసి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, ఏఈఓలు సృజన, దివ్యశ్రీ, డీసీసీబీ మేనేజర్ ప్రద్యుమ్నారెడ్డి, కృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఐకేపీ సీసీ రమేశ్, నాగరాజు, సొసైటీ అధికారులు సుధాకర్, విష్ణు, కిషన్, నిర్వాహకులు కృష్ణ, సురేశ్, రైతులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి, మడూర్, చందంపేట సహకార సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జంగరాయి, మడూర్, చందంపేట పీఏసీఎస్ సీఈఓలు బాలకిషన్, కృష్ణ, చంద్‌పాషా ఉన్నారు.



కొడిపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సీఈఓ దుర్గయ్య



కొల్చారం(నర్సాపూర్): కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి నాగరాజు

రామాయంపేట(మెదక్): మండలంలోని పర్వతాపూర్, కాట్రియాల, లక్ష్మాపూర్, తొనిగండ్ల, శివాయపల్లి, ఆర్.వెంకటాపూర్, రాయిలాపూర్, కోనాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పండిత్, ఎంపీడీఓ ఉమాదేవి, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, రామాయంపేట, కోనాపూర్ సహకార సంఘాల సీఈవోలు నర్సింలు, మల్లారెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సాయికృష్ణ, రాజు, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేటలో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పరికిబండతో పాటు దండుపల్లి గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ ఎపీఎం పెంటాగౌడ్, సర్పంచ్ అర్జున్, రైతులు పాల్గొన్నారు.

తిరుగులేని శక్తిగా బీఆర్‌ఎస్

మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ నియోజవర్గంలో ప్రముఖ రాజకీయ నాయకులందరూ పార్టీలో చేరడంతో తిరుగులేని శక్తిగా బీఆర్‌ఎస్ మారిందని పార్టీ మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మెదక్ నియోజవర్గ సీనియర్ నాయకులు ఏకే గంగాధర్‌రావు ఇంటికి వెళ్లి కలిశారు. సీఎం కేసీఆర్ సమక్షంలో టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఏకే రమేశ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, గవ్వలపల్లి ఉపసర్పంచ్ రామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

రామాయంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలానికి చెందిన దివ్యాంగులు, రామాయంపేట మండలానికి చెందిన మైనంపల్లి సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సభ్యులు సోమవారం మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు సోమవారం రామాయంపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె వారి మెడలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నాగరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



రామాయంపేటలో పార్టీలో చేరిన వారితో పద్మాదేవేందర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని సర్దన గ్రామానికి చెందిన 100 మంది యువకులు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు వైస్ ఎంపీపీ రాధాకిషన్‌యాదవ్ సోమవారం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాణిక్యరెడ్డి, సతీశ్‌రావు, సంతోష్‌రావు ఉన్నారు.

సమష్టి కృషితో విజయం

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతా రెడ్డి విజయం సాధిస్తారని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దొంతి గ్రామంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కొత్త, పాత అట్టు ఎమిలేదని అందరం ఒకే బీఆర్‌ఎస్ కుటుంబానికి చెందిన వ్యక్తులమని సునీతారెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ, సర్పంచ్‌లు ఫణిశశాంక్‌శర్మ, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, నాయకులు యాదగౌడ్, లాయక్, మహేందర్‌రెడ్డి, విరేశ్, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌ను గెలిపించాలని రాష్ట్ర నాయకుడు శేఖర్‌గౌడ్ కోరారు. మండలంలోని పలాటలో బీఆర్‌ఎస్ తరఫున సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటేనే అభివృద్ధి జరుగుతుందని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణరెడ్డి, నాయకులు రమేశ్, భిక్షపతి, రాహుల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.




ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

కేసీఆర్‌ను అధిక మెజార్టీతో గెలిపించండి

తూప్రాన్: సీఎం కేసీఆర్‌ను భారీ మేజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఆయా వార్డుల్లో మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోలీస్‌ల బలగాల కవాతు

తూప్రాన్: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పోలీసు బలగాలు సోమవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలు ఘనపూర్, నర్సంపల్లి, ఇస్లాంపూర్, నాగులపల్లి గ్రామాల్లో సుమారు 50 మంది పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి సంఘవిద్రోహక చర్యలకు పాల్పడితే వారిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్‌ఐ శివానందం, పోలీసులు పాల్గొన్నారు.



నాగులపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నగదు స్వాధీనం

హవేళిఘనాపూర్(మెదక్): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండల పరిధిలోని పోచమ్మరాళ్ చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నగదు పట్టుబడినట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. ఆధారాలు లేని రూ.1లక్షా 2వేల నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజలు ఆధారాలు లేకుండా నగదును తరలిస్తే సీజ్ చేస్తామని తెలిపారు.

ప్రజా ఆశీర్వాదసభకు తరలిన నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్‌లో జరిగిన ముఖ్యమంత్రి ప్రజాఆశీర్వాద సభకు సోమవారం మండలం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమానికి తరలిన వారిలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మురళి పంతులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులున్నారు.


విధులు సమర్థవంతంగా నిర్వహించాలి



శిక్షణను పరిశీలిస్తున్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

నర్సాపూర్: ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని నర్సాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు ఎంపిక చేసిన పీఓ, ఏపీఓ, పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి పీఓ, ఇతర సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులు చేసే పీఓ ఇతర సిబ్బంది తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కాగా పలువురు రిసోర్స్ పర్సన్స్ వారికి శిక్షణ ఇచ్చారు. ఆయన వెంట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కమలాద్రి తదితరులు ఉన్నారు.

యువతి ఆత్మహత్య



పావని (ఫైల్)

హవేళిఘనాపూర్(మెదక్): అనుమానాస్పద స్థితి లో ఒక యువతి మృతి చెందిన ఘటన మెదక్ మండల పరిధిలోని శివ్వాయిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివ్వాయిపల్లి చెందిన కొల్ల శేఖవ్వ, మల్లేశం రెండో కుమార్తె పావని(21) డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమె ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తనకు బతక డం ఇష్టం లేదని లేఖలో పేర్కొనడం పలు అనుమానాలకు తావిస్తోంది. తమ కూతురి మృతిపై విచారణ చేపట్టాలని సోమవారం పావని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లైవ్ సర్టిఫికెట్లు అందించండి

పెద్దశంకరంపేట(మెదక్): రిటైర్డ్ ఉద్యోగులందరూ 2023 – 24 సంవత్సరానికి లైవ్ సర్టిఫికెట్‌ను ఎస్టీఓ కార్యాలయంలో అందించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు నర్సింలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 1 నుంచి లైవ్ సర్టిఫికేట్స్‌ను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు చేస్తాం

మెదక్: కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ అధికార బీఆర్‌ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ ఎన్నికల సంఘానికి వారిపై ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ నాయకులు సురేందర్‌గౌడ్, జీవన్‌రావు, హఫిజొద్దీన్ పేర్కొన్నారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ జాతీయ నాయకుడు మల్లికార్జున ఖర్గే మెదక్ వచ్చిన సందర్భంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు కడితే మున్సిపల్ సిబ్బంది తొలగించినట్లు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే కుమారుడు పునీత్‌రెడ్డికి ఏ హోదాలో పోలీస్ బందోబస్తు ఇస్తున్నారని, అదే కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావుకు ఎందుకు ఇవ్వటం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మంగ, దాయర లింగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అన్ని పాఠశాలల్లో అల్పాహారం ఇవ్వాలి

నిజాంపేట(మెదక్): సీఎం అల్పాహారం పథకాన్ని అన్ని పాఠశాలలో అమలు చేయాలని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాసి సంజీవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నస్కల్, రాంపూర్, నందగోకుల్ గ్రామల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం పథకం అమలు కావడం లేదన్నారు. నిజాంపేట మండలంలో దసరా సెలవుల తర్వాత కేవలం చల్మెడ గ్రామంలో ఉన్నత పాఠశాలలో మాత్రం కొనసాగిందని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను, పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అన్ని పాఠశాలలో అల్పాహారం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.



రాంపూర్‌లో అల్పాహారాన్ని పరిశీలిస్తున్న డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాసి సంజీవ్

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. టేక్మాల్ మండలంలోని కోరంపల్లి గ్రామానికి చెందిన హనుమంతు ఫిర్యాదు చేస్తూ.. 2015 నుంచి తాను కోరంపల్లి గ్రామంలో వీఆర్‌ఏగా పని చేస్తున్నానని తెలిపాడు. రెండు నెలల క్రితం తనని పర్మినెంట్ చేయగా, సిద్దిపేట జిల్లా తొగుట మండల తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌కు అసిస్టెంట్‌గా పని చేస్తున్నానని పేర్కొన్నాడు. తనది పర్మినెంట్ అయినందుకు తమ పాలివారు డబ్బులు అడిగి చంపుతామని బెదిరిస్తున్నారని వాపోయాడు. కావున తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్ట ప్రకారం ఫిర్యాదుకి తగిన న్యాయం చేయాలని టేక్మాల్ ఎస్ఐకి సూచనలు చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న రోహిణీ ప్రియదర్శిని

రెండు మొబైల్ షాపుల్లో చోరీ

- నగదు, ఫోన్లు, సీసీ కెమెరాల అపహరణ
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీం

కొడిపల్లి(నర్సాపూర్): రెండు మొబైల్ షాపుల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. నగదుతో పాటు ఫోన్లు, సీసీ కెమెరాలు అపహరించిన ఘటన కొడిపల్లిలో సోమవారం జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడిపల్లి బస్టాండ్ సమీపంలోని శివం, భవ్య మొబైల్ షాపుల యజమానులు తమ పనులు పూర్తి చేసుకొని రాత్రి తాళం వేసి ఇళ్లకు వెళ్లారు. ఉదయం వచ్చి చూడగా, చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శివం మొబైల్‌షాపు పైన రేకులు తొలగించి దుండగులు చోరీకి పల్పడ్డారు. అందులో రూ.52 వేలు, ఏడు కొత్త ఫోన్‌లు, ఎనిమిది రిపేర్ చేసిన ఫోన్లు చోరీకి గురైయ్యాయని షాపుయజమాని రాంప్రసాద్ తెలిపారు. అలాగే భవ్య మొబైల్‌షాపులో రూ.20వేలు నగదు, ఆరు ఫోన్‌లు, ఇతర వస్తువులు చోరీ జరిగినట్లు యజమాని భరత్‌గౌడ్ తెలిపారు. ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి, ఏఎస్‌ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భవ్య మొబైల్‌షాప్‌లో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడి అమానుషం



చేగుంటలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ఎన్నికల ప్రచారంలో ఉన్న దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై కత్తితో దాడి చేయడం అమానుషమని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండిచారు. సోమవారం మెదక్‌లో ఆమె మాట్లాడుతూ.. ప్రజల మనిషి, కనీసం ఎప్పుడు కూడా ఎవర్ని కోపంగా ఒక్క మాట అనని ప్రజా నాయకుడి దాడి చేయడం చాలా దారుణం అన్నారు.

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు రాస్తారోకో నిర్వహించి దుకాణాలు మూసి వేయించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీపీ సబిత, పార్టీ మండలాధ్యక్షుడు బాబు, సహకార సంఘం అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మండల రైతు బంధు అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీ సత్యనారాయణ, పార్టీ జిల్లా నాయకులు మల్లేశంగౌడ్, రాజేశ్, భూపతిరాజ్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఖండిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు చేగుంట గాంధీ చౌరస్తా వద్ద రస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్ ,సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, రాజిరెడ్డి, ప్రవీణ్, తానీషా, వెంకట్‌రెడ్డి, సోమ సత్యం, పలు గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేయడంపై పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి తీవ్రంగా ఖండించారు.

‘అభ్యర్థిని మార్చకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ’

నర్సాపూర్: నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిని మార్చని పక్షంలో తమలో ఒకరు స్వంతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తామని పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ హెచ్చరించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోవర్టుగా వ్యవహరించిన ఆవుల రాజిరెడ్డికి టికెట్ ఇవ్వడాన్ని మెజారిటీ నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు కక్కుర్తి పడి ఆవుల రాజిరెడ్డికి టికెట్ ఇచ్చారని ఆయన ఆరోపించారు. సమావేశంలో ఎంపీపీ జ్యోతి, పార్టీ నాయకులు రవీందర్‌రెడ్డి, విజయ, అశోక్, సురేశ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్కరాజీపేట గ్రామానికి చెందిన లావణ్య(24)కు రెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్నముత్యంతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్దిరోజులుగా లావణ్యకు భర్త ముత్యం, అత్త ఎల్లవ్వకు తరుచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం పొలం వద్ద లావణ్య, భర్త ముత్యం గొడవపడ్డారు. అనుమానాస్పదంగా లావణ్య పక్కనే ఉన్న బావిలో పడిపోయి మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ స్తులు పోలీసులకు సమాచారం అందించగా భయంతో అత్త ఎల్లవ్వ, భర్త ముత్యం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. మృతురాలి తల్లిదండ్రులు కలమ్మ, సత్తయ్య రెడ్డిపల్లికి చేరుకొని అత్తింటివారే తమ కూతురుని చంపేసి బావిలో పడేశారని ఆరోపించారు. వారి ఫిర్యాదు మేరకుకేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.